
సాక్షి అనంతపురం

శనివారం । 6 । ఏప్రిల్ । 2024



చీనీ టన్ను రూ.30 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.30 వేలు పలికాయి.



టమాట కిలో రూ.12

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.12 పలికింది. కనిష్టం రూ.4, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 4.55



న్యూస్‌రీల్

బాబు జగ్జీవన్‌రామ్ మహోన్నత వ్యక్తి



జగ్జీవన్ రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: నవభారత నిర్మాణంలో బాబు జగ్జీవన్ రామ్ పాత్ర మహోన్నతమైనదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతి నిర్వహించారు. జేడీ మధుసూదన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జగ్జీవన్‌రామ్ చిరస్మరణీయులన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, బీసీ సంక్షేమ శాఖ డీడీ కుష్బూకోఠారి, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్, సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ.. ఒకరి మృతి

- 'స్పాట్'కు వెళ్తున్న ఐదుగురు ఉపాధ్యాయులకు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న ఉపాధ్యాయులను పరామర్శిస్తున్న డీఈఓ వరలక్ష్మి



మృతి చెందిన నాగేశ్వరప్రసాద్ (ఫైల్)

బెళుగుప్ప: మండల పరిధిలో జాతీయ రహదారిపై శుక్రవారం రెండు కార్లు పరస్పరం ఢీకొన్నాయి. ఘటనలో ఓ వైద్యుడు మృతి చెందారు. ఐదుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... తూర్పు గోదావరి జిల్లా గన్నవరం మండలం నరేంద్రపురం గ్రామానికి చెందిన ఆయుర్వేద విశ్రాంత వైద్యాధికారి నాగేశ్వరప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలసి రాయదుర్గానికి కారులో వెళుతుండగా బెళుగుప్ప మండలం హనిమరెడ్డి పల్లి వద్దకు చేరుకోగానే ఎదురుగా వేగంగా దూసుకొచ్చిన మరో కారు ఢీకొంది. ప్రమాదానికి కారణమైన కారులో అనంతపురంలో జరుగుతున్న పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్‌లో పాల్గొనే కళ్యాణదుర్గం ప్రాంతానికి చెందిన ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. ఘటనలో రెండు కార్లూ పూర్తిగా ధ్వంసమయ్యాయి. తీవ్ర గాయాలతో డాక్టర్ నాగేశ్వరప్రసాద్ అపస్మారక స్థితికి చేరుకున్నారు. నేత్రపల్లి, దురదకుంట, నరసాపురం, లక్ష్మంపల్లి, బ్రహ్మసముద్రం జెడ్పీ హెచ్‌ఎస్‌ల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు తిప్పేస్వామి, రామశేఖర్, హరికృష్ణ, రామచంద్ర, తిప్పేస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. చికిత్సకు స్పందించక డాక్టర్ నాగేశ్వర ప్రసాద్ మృతి చెందారు. డీఈఓ వరలక్ష్మి, గుత్తి డివిజన్ డిప్యూటీఈఓ శ్రీదేవి ఉపాధ్యాయులను పరామర్శించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

పట్టా పట్టగానే పరిశ్రమ బాట

- పీజీ కోర్సులో సమూల మార్పులు
- నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా విద్యా ప్రణాళిక
- ఎస్కేయూ పరిధిలో 2024–25 విద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సుల్లో నూతన సిలబస్
- పట్టాతో పాటు ఉపాధి కల్పనే ధ్యేయం



అనంతపురం: విద్యార్థులకు పట్టా అందించడంతో పాటు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా ఉన్నత విద్యా మండలి పీజీ కోర్సుల్లో సమూల మార్పులు ప్రవేశపెట్టింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని పరిశ్రమల అవసరాలకు దీటుగా విద్యార్థిని తీర్చిదిద్దే లక్ష్యంతో కొత్త విద్యా ప్రణాళిక అందుబాటులోకి తీసుకొస్తోంది. వర్సిటీల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేసి నైపుణ్యాలు పెంపొందించనున్నారు. 2024–25 విద్యా సంవత్సరం నుంచి పీజీ కోర్సుల్లో నూతన విద్యా ప్రణాళిక అమల్లోకి రానుంది. వర్సిటీ క్యాంపస్ కళాశాలలతో పాటు అనుబంధ పీజీ కళాశాలల్లోనూ ఈ విధానం అమలు చేస్తారు.

డిగ్రీతోనే శ్రీకారం..

పీజీలో ప్రధానంగా పరీక్ష విధానం, మెథడాలజీ, బోధన పద్ధతులు, పాఠ్య ప్రణాళికలో ప్రవేశపెట్టాల్సిన మార్పులపై దృష్టి సారించారు. ఇప్పటివరకూ డిగ్రీ విద్యలో మేజర్‌గా మూడు సబ్జెక్టుల ప్రధాన కాంబినేషన్‌తో విద్యా బోధన సాగుతోంది. అయితే, విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం అందులో భాగంగానే ఇకపై ఒక మేజర్ సబ్జెక్టు ప్రధానంగా డిగ్రీ విద్య కొనసాగేలా మార్పులు తీసుకొచ్చింది. గతంలో బీఎస్సీ– ఎంపీసీ (మూడు సబ్జెక్టుల కాంబినేషన్) ఉండగా ఆ స్థానంలో బీఎస్సీ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీలో ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. రెండో సెమిస్టర్ నుంచి దాదాపు 100 కోర్సుల నుంచి విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో మైనర్ సబ్జెక్టును ఎంపిక చేసుకునే వెసులుబాటు కల్పించారు. తద్వారా మేజర్, మైనర్ సబ్జెక్టుల్లో ఏదో ఒక దానితో పీజీ విద్యను అభ్యసించేలా మార్పులకు శ్రీకారం చుట్టారు.

నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా..

నూతన జాతీయ విద్యా విధానం–2020కు అనుగుణంగా పీజీ కోర్సు సిలబస్ రూపకల్పన చేశారు. రెండు స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులు ప్రవేశపెట్టారు. గతంలో ఒక కోర్సు మాత్రమే ఉండేది. ఇకపై పీజీలో మూడు సబ్జెక్టు కోర్ పేపర్‌లు ఉండనున్నాయి. నాలుగో సెమిస్టర్ మొత్తం ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. మూడో సెమిస్టర్‌లో ఏ,బీ రెండు ఆప్షన్లు ఇచ్చారు. రీసెర్చ్ మెథడాలజీ ప్రవేశపెట్టారు. రీసెర్చ్ మెథడాలజీని విద్యార్థుల ఆసక్తి మేరకు చదవవచ్చు. లేకపోతే వారి పీజీ కోర్సు సబ్జెక్టులను చదువుకోవచ్చు. త్వరలో సిలబస్ అంశంపై బోర్డ్‌ఆఫ్ స్టడీస్ సమావేశంలో ఆమోదం తీసుకోనున్నారు.

ప్రపంచంతో పోటీపడేలా తర్ఫీదు



ప్రపంచంతో పోటీ పడుతూ మన విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించాలి. నాణ్యమైన విద్య ద్వారానే ఇది సాధ్యం. అందుకు విద్యలో అంతర్జాతీయ ప్రమాణాలు ఉండాలి. అప్పుడే మన విద్యార్థులకు మెరుగైన అవకాశాలు వస్తాయి. ఇందులో భాగంగా పీజీ కోర్సులో సమూలమైన మార్పులు తీసుకొస్తున్నాం. నైపుణ్యాలు పెంపొందించే రీతిలో కోర్సులు రూపకల్పన చేస్తున్నాం.

– ప్రొఫెసర్ కే. హుస్సేన్ రెడ్డి, వీసీ, ఎస్కేయూ

దేశంలో తొలి రాష్ట్రం



ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు ఉండాలి. అప్పుడే ఉపాధి అవకాశాలు దక్కుతాయి. నైపుణ్యం లేకుండా కోర్సులు పూర్తి చేస్తే ఫలితం లేదు. ఈ క్రమంలో పీజీని పూర్తిగా నైపుణ్య కేంద్రంగా తీర్చిదిద్దనున్నాం. ఇందులో భాగంగానే పీజీ నాలుగో సెమిస్టర్ పూర్తిగా ప్రాజెక్ట్ వర్క్‌కు కేటాయించారు. ఇప్పటి దాకా ఇలాంటి విద్యా ప్రణాళికను ఏ రాష్ట్రంలోనూ అమలు చేయలేదు. దేశంలో తొలి రాష్ట్రంగా ఏపీకి గుర్తింపు దక్కనుంది.

– ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, రిజిస్ట్రార్, ఎస్కేయూ

వైఎస్సార్ సీపీ డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా రాగే



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం, హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా రాగే పరుశురాం నియమితులయ్యారు. ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంలో భాగంగా పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆయనను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆయన పనిచేస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. రాగే పరుశురాం అనంతపురం నగరపాలక సంస్థ మేయర్‌గా 2005 నుంచి 2010 వరకు పనిచేశారు. 2014 ఎన్నికలకు ముందు వైఎస్సార్ సీపీలో చేరారు. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వివిధ హోదాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేశారు. పరుశురాం సేవలను గుర్తించిన పార్టీ అధిష్టానం 2014లో రాయదుర్గం ఎన్నికల పరిశీలకుడిగా, 2021 స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులుగా నియమించింది. దీంతో పాటు ఆయన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అనంతపురం, హిందూపురం నియోజకవర్గాల డిప్యూటీ రీజినల్ కో ఆర్డినేటర్‌గా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో రాగే పరుశురాం మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఎన్నికల సమయంలో అత్యంత కీలకమైన పదవి అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని పేర్కొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- నూతన కలెక్టర్ వి.వినోద్ కుమార్
- విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సిబ్బందికి ఆదేశం



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ వి.వినోద్‌కుమార్



కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించడమే లక్ష్యమని నూతన కలెక్టర్ వి.వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రచార కార్యక్రమాలు, సభలు, సమావేశాల నిర్వహణకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. విమర్శలకు తావివ్వకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు.

అధికారుల శుభాకాంక్షలు

కలెక్టర్ వినోద్‌కుమార్‌కు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. మొక్కలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్డీఓ జి.వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, శంకరయ్య, విశ్వనాథ్, శిరిష, డీపీఓ ఆర్‌ఓ గురుస్వామిశెట్టి, డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా పీడీలు నరసింహారెడ్డి, విజయలక్ష్మి, వేణుగోపాల్‌రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్, డీఎంహెచ్‌ఓ ఈ.బి.దేవి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజరావు, వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ, కలెక్టరేట్ పరిపాలనాధికారి అంజన్‌బాబు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ రవికుమార్, వివిధ శాఖల అధికారులు కూడా కలెక్టర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నోడల్ అధికారులు జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి

''సార్వత్రిక ఎన్నికల్లో నోడల్ అధికారులది కీలక పాత్ర. దీన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తగా విధులు నిర్వర్తించాలి.'' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటాయించిన ఎన్నికల విధుల విషయంలో నోడల్ అధికారులు స్పష్టతతో ఉంటూ పనిచేయాలన్నారు. నివేదికలన్నీ సకాలంలో అందించాలన్నారు. ఏదేని సమస్య ఉత్పన్నమయితే 24 గంటల్లో పరిష్కరించాలన్నారు. ప్రతి అంశంపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. 'సి.విజిల్' యాప్‌ద్వారా అందే ఫిర్యాదులు 100 నిమిషాల్లో పరిష్కరించి నివేదిక అందించాలన్నారు. జిల్లాకు ఎన్నికల పరిశీలకులు వచ్చినప్పుడు సమగ్ర నివేదికలు అందించాలన్నారు. ఓటు వినియోగం, ఓటు విలువపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో క్రియాశీలకంగా పనిచేయాలి

అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది క్రియాశీలకంగా పనిచేయాల్సి ఉంటుందని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ అందుబాటులో ఉండాలని చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి కలెక్టర్ కార్యాలయ విభాగాల సూపరింటెండెంట్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. వారికి కేటాయించిన విధులను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయ్యే వరకు పనిభారం అనుకోకుండా కేటాయించిన విధులు జాగ్రత్తగా నిర్వర్తించాలన్నారు. ఎప్పుడు ఎలాంటి అవసరం వస్తుందో చెప్పలేమని, కాబట్టి ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఆదేశాలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఏవైనా సమస్యలు ఉంటే డీఆర్‌ఓ దృష్టికి తీసుకొస్తే, పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి అంజన్‌బాబు, సూపరింటెండెంట్లు రవికుమార్, నాగభూషణం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సలసల మండుతున్న సూరీడు



ఎంత దాహమైందో: అనంతపురంలోని ఓ పైపులైను వద్ద దాహం తీర్చుకుంటున్న మూగజీవాలు

అనంతపురం అగ్రికల్చర్: సూరీడు సలసల మండుతున్నాడు. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత పెరగడంతో ఉమ్మడి 'అనంత' అగ్నిగుండంలా మారింది. వైశాఖం రాకమునుపే భానుడు భగ్గుమంటుండడంతో జనజీవనానికి ఇబ్బందిగా తయారైంది. ఎండల ప్రభావంతో పశుపక్ష్యాదులూ విలవిల్లాడుతున్నాయి. శుక్రవారం గుంతకల్లు మండలం పాతకొత్తచెరువులో ఏకంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కావడం గమనార్హం. అలాగే తాడిపత్రి 43.8 డిగ్రీలు, శింగనమల 43.6 డిగ్రీలు, యల్లనూరు 43.4 డిగ్రీలు, కూడేరు 42.7 డిగ్రీలు, బొమ్మనహాళ్ 42.6 డిగ్రీలు, అనంతపురం, యాడికి 42.2 డిగ్రీలు, బుక్కరాయసముద్రం 42.1 డిగ్రీలు నమోదు కాగా మిగతా మండలాల్లో 40 నుంచి 42 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 27 డిగ్రీల మధ్య రికార్డయ్యాయి. శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో కూడా గ్రీష్మతాపం కొనసాగుతోంది. శుక్రవారం పుట్టపర్తిలో 42.6 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా పరిగి,చెన్నేకొత్తపల్లి 42.5 డిగ్రీలు, కొత్తచెరువు 42.4 డిగ్రీలు, ముదిగుబ్బ 42.2 డిగ్రీలు, ధర్మవరం, కదిరి, తలుపుల 42.1 డిగ్రీల గరిష్టం నమోదైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా 20 నుంచి 27 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మధ్యాహ్న సమయంలో కొన్ని ప్రాంతాల్లో 15 శాతానికి పడిపోతుండగా మిగతా ప్రాంతాల్లో 20 శాతం వరకు రికార్డవుతోంది. వడదెబ్బను దృష్టిలో ఉంచుకుని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగం, నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రూ.1.91 కోట్ల నగదు సీజ్

- రూ.42.75 లక్షల మద్యం పట్టివేత

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి మేరకు ఆధారాలు లేకుండా రూ.50 వేలకు మించి తరలించకూడదని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇప్పటి వరకూ తరలించిన రూ.1,91,53,295 నగదును ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు సీజ్ చేశాయన్నారు. అదే విధంగా ఎలెక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఇప్పటి వరకూ రూ.42,75,556 విలువ చేసే 10,777.78 లీటర్ల మద్యం సీజ్ చేసినట్లు వెల్లడించారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన కాలవ

- కేసు నమోదు చేసిన పోలీసులు

రాయదుర్గం: అనుమతుల్లేకుండా ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులుపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొమ్మనహాళ్ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపిన మేరకు.. గత మంగళవారం బొమ్మనహాళ్ మండలం ఉంతకల్లులో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా ఉంతకల్లు క్రాస్ నుంచి గ్రామం వరకూ ద్విచక్ర వాహనాల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ విషయంపై ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్, ఎఫ్‌ఎస్‌టీ అధికారులు విచారణ చేపట్టారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించినట్లు నిర్ధారించుకుని స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కాలవ శ్రీనివాసులుతో పాటు రాయదుర్గం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ చంద్రహాస్, టీడీపీ నాయకులు కెంచప్ప, సులేమాన్‌పై ఐపీసీ 188, 341 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

● చేరికల వెల్లువ



పామిడిలో ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న ముస్లింలు



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న తాడిపత్రి పట్టణం ఇందిరానగర్ వాసులు

వైఎస్సార్ సీపీలోకి చేరికలు వెల్లువలా కొనసాగుతున్నాయి. చంద్రబాబు కుటిల బుద్ధిని గమనించిన టీడీపీ నాయకులు ఆ పార్టీని వీడుతున్నారు. సంక్షేమ సారథి వైఎస్ జగన్‌కు జై కొడుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీని కేడర్ వీడుతుండడంతో ఆ పార్టీ నేతలు ఉక్కిరిబిక్కిరవుతుంటే.. అధికార పార్టీ నాయకులు మాత్రం కొత్త ఉత్సాహంతో కదన రంగంలో దూసుకుపోతున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

'షూ'ర్‌గా సరిపోతుంది!

- షూల కోసం విద్యార్థుల నుంచి కొలతల సేకరణ
- వాటి ప్రకారమే షూలు పంపనున్న కంపెనీలు
- మిస్ మ్యాచింగ్ వస్తే ఆయా కంపెనీలదే బాధ్యత
- బడి తెరిచే నాటికి సిద్ధం కానున్న జేవీకే కిట్లు



బెళుగుప్ప కేజీబీవీలో విద్యార్థిని పాదాల కొలతలు తీసుకుంటున్న దృశ్యం (ఫైల్)

అనంతపురం ఎడ్యుకేషన్: పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. వసతుల్లో కార్పొరేట్ పాఠశాలలను మించి మన స్కూళ్లు తయారయ్యాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న 1–10 తరగతుల విద్యార్థుల కోసం 'జగనన్న విద్యా కానుక కిట్లు' (జేవీకే) అందజేస్తున్నారు. జేవీకే కిట్లలో మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, 6–10 తరగతుల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, రెండుజతల సాక్సులు, ఒక జత బూట్లు, బెల్టు, స్కూల్ బ్యాగ్, ఆక్స్‌ఫర్డ్ పిక్టోరియల్ డిక్షనరీలు ఉంటాయి. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇందుకోసం రాష్ట్ర స్థాయి అధికారుల నుంచి పాఠశాల స్థాయి హెచ్‌ఎం వరకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పిల్లల కాళ్లకు సరిపడే సైజు షూల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నారు. ఒక తరగతి విద్యార్థుల వయసు ఆధారంగా ఒకే సైజు షూలు పంపిణీ చేస్తే కొందరికి సరిపోక వాటిని వేసుకోలేక ఇబ్బందులు పడతారనే ఉద్దేశంతో ప్రతి విద్యార్థి నుంచి వ్యక్తిగతంగా కొలతలు తీసుకోవాలని నిర్ణయించింది. జిల్లాలోని 1,720 ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల్లో 1–9 తరగతుల విద్యార్థులు 1.91 లక్షల మంది ఉన్నారు. వేసవి సెలవుల అనంతరం బడులు తెరిచే నాటికి అన్ని స్కూళ్లలోనూ జేవీకే కిట్లు సిద్ధంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

వందశాతం పూర్తి

షూలకు సంబంధించి పాఠశాలల్లో ప్రతి విద్యార్థి నుంచి కొలతలు తీసుకుంటున్నారు. హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లదే పూర్తి బాధ్యత. విద్యార్థుల కొలతలు తీసుకుని వాటిని ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేశారు. జిల్లాలో ఈ ప్రక్రియ వందశాతం పూర్తయింది. కొలతల జాబితాలకు సంబంధించిన హార్డ్‌కాపీలను హెచ్‌ఎంలు మండల విద్యాశాఖ అధికారులకు అందజేశారు. ఆ డేటా ఆధారంగానే షూలు రానున్నాయి. ఆ సమయంలో ఏ ఒక్క విద్యార్థికీ షూ సరిపోకపోతే హెచ్‌ఎంలు బాధ్యత వహించాల్సి ఉంటుంది. హెచ్‌ఎంలు పంపిన కొలతలు కాకుండా మిస్ మ్యాచింగ్ షూలు సరఫరా చేస్తే ఆయా కంపెనీలపై చర్యలు తీసుకోనున్నారు. విద్యాకానుకలు నేరుగా మండలాల్లోని స్టాక్ పాయింట్లకు సరఫరా అవుతాయి.

ప్రతి విద్యార్థి కొలతలు తీసుకున్నాం

జేవీకే కిట్ల పంపిణీలో భాగంగా షూలకు సంబంధించి ప్రతి విద్యార్థి నుంచి కొలతలు తీసుకున్నాం. జిల్లాలోని అన్ని స్కూళ్ల నుంచి వివరాలు వచ్చాయి. నివేదికను రాష్ట్ర అధికారులకు పంపాం. ప్రతి విద్యార్థికీ సరిపోయే సైజులోనూ షూలు పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. హెచ్‌ఎంలు ఇచ్చిన వివరాల మేరకే షూలు రానున్నాయి. ఇందులో ఏమాత్రం తేడా వచ్చినా ఆయా కంపెనీలదే బాధ్యత. ఒకవేళ హెచ్‌ఎంలు నిర్లక్ష్యం చేసి ఉంటే వారే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

– వరప్రసాదరావు, ఏపీసీ సమగ్ర శిక్ష

క్లుప్తంగా

ఆటో బోల్తా - 15 మందికి గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ఆటో బోల్తాపడిన ఘటనలో 15 మంది వ్యవసాయ కూలీలు గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన మేరకు... విడపనకల్లు మండలం మాళాపురం గ్రామానికి చెందిన మహిళా కూలీలు శుక్రవారం ఉదయం ఉరవకొండ మండలం ఇంద్రావతి గ్రామంలో మిరప పంట తొలగించేందుకు ఆటోలో బయలుదేరారు. బూదగవి వద్దకు చేరుకోగానే ఎదురుగా అడ్డు వచ్చిన గొర్రెను తప్పించబోవడంతో ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న 15 మంది కూలీలు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్‌లో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.కాగా, విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వీరన్న... అనంతపురంలోని సర్వజనాస్పత్రికి చేరుకుని బాధితులను పరామర్శించారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న జేసీ

అనంతపురం అర్బన్: ప్రతి ఓటరూ సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యకలాపాల్లో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' అంటూ ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్ వద్ద ఆయన సెల్ఫీ దిగి మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ మే 13న జరగనుందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు వేసి ధృడమైన ప్రజాస్వామ్య సౌధాన్ని నిర్మిద్దామంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి తమకు అవసరమైన సేవలను పొందవచ్చునని తెలిపారు.

గుంతకల్లులో ఉచిత డయాలసిస్

- కిడ్నీ రోగుల పాలిట వరంగా మారిన కేంద్రం
- తగ్గిన ఆర్థిక భారం.. మెరుగుపడుతున్న ఆరోగ్యం



గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి


డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు

గుంతకల్లు టౌన్: కిడ్నీ వ్యాధిగ్రస్తుల బాధ వర్ణనాతీతం. నెలకు కనీసం నాలుగైదు సార్లైనా రక్తశుద్ధి చేయించుకోకపోతే పరిస్థితి పూర్తిగా దిగజారి పోతుంది. చివరకు ప్రాణాలు సైతం కోల్పోవాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో స్థానికంగా కేంద్రాలు అందుబాటులో లేకపోతే డయాలసిస్ చేయించుకోవడం అత్యంత ఖర్చుతో కూడుకున్నది. సుదూర ప్రాంతానికి వెళ్లి డయాలసిస్ చేయించుకుని వస్తున్న రోగుల దుస్థితిపై స్థానిక ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి చలించిపోయారు. విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గుంతకల్లులోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ కేంద్రం మంజూరు చేయించుకుని వచ్చారు. వారం రోజుల క్రితమే ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చిన ఉచిత డయాలసిస్ కేంద్రం రోగులకు వరంగా మారింది. ఆర్థిక ఇబ్బందులు తీరడమే కాక ఆరోగ్యమూ మెరుగుపడుతోంది.

రూ.80 లక్షలతో కేంద్రం ఏర్పాటు

గుంతకల్లు నియోజకవర్గంలో చుట్టుపక్కల ఎక్కడేగాని డయాలసిస్ కేంద్రం లేదు. డయాలసిస్ చేయించుకునేందుకు రోగులు కర్నూలు, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలకు వెళ్లేవారు. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం గుంతకల్లు పెద్దాస్పత్రిలో ఎన్‌హెచ్ఎం-స్టేట్ ప్రోగామ్ మేనేజ్‌మెంట్ యూనిట్ కింద డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు రూ.80 లక్షల నిధులు కేటాయించింది. ఈ కేంద్రం నిర్వహణను ప్రభుత్వం రాహీ కేర్ సంస్థకు అప్పగించింది. కేంద్రంలో ఓ మెడికల్ ఆఫీసర్, సెంట్రల్ మేనేజర్, టెక్నీషియన్, నర్సులను నియమించారు. ఐదు ఆధునాతనమైన (విప్రో సర్‌డయల్) మిషన్ల ద్వారా రోజూ రోగులకు ఉచితంగా వైద్య సేవలందిస్తున్నారు. ఇందులో నాలుగు మిషన్లను కిడ్నీరోగులు, మరో మిషన్‌ను ప్రత్యేకించి హెచ్ఐవీ వ్యాధిగ్రస్తుల కోసం కేటాయించారు. ఇప్పటి వరకూ గుంతకల్లు చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన 36 మంది కిడ్నీరోగులు డయాలసిస్ కేంద్రం ద్వారా ఉచిత సేవలు పొందారు.

రూ.2వేలు ఆదా



"వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్న నాకు ఏడాది క్రితం కిడ్నీలు సక్రమంగా పనిచేయడం లేదని వైద్యులు నిర్ధారించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యచికిత్సల నిమిత్తం రూ.నాలుగైదు లక్షలు ఖర్చు చేసుకున్నా. తర్వాత వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఆరు నెలలుగా అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వారానికి నాలుగుసార్లు డయాలసిస్ ఉచితంగా చేయించుకున్నా. అయితే ఆస్పత్రికి రాకపోకలు, ఇతర ఖర్చుల కింద ప్రతి సారి రూ.2 వేలు ఖర్చు అయ్యేది. గుంతకల్లులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంతో నా ఆర్థిక కష్టాలు తీరాయి. ఆరోగ్యమూ మెరుగుపడుతోంది. – కె.వన్నప్ప, గడేహోతూరు

ఓ రోజు జాగరణ.. వెయ్యి మాసాల పుణ్యఫలం

- పాపపుణ్యాల క్షమార్హ దినంగా షబేఖదర్
- నేడు జాగరణకు ముస్లింలు సన్నద్ధం



బత్తలపల్లి: ముస్లింలకు శుభప్రదమైన, పుణ్యప్రదమైన రాత్రి షబేఖదర్ (షబ్–ఏ–ఖదర్) రానేవచ్చింది. రంజాన్ మాసంలోని చివరి వారంలో 26వ రోజు రాత్రిని షబేఖదర్‌గా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనినే సతామి, లైలతుల్‌ఖదర్ అని కూడా పిలుస్తారు. షబే అంటే రాత్రి, ఖదర్ అంటే గౌరవమైన అని అర్థం. ఈ ఒక్కరోజు జాగరణతో చేసే ఆరాధనతో వెయ్యి మాసాల పుణ్యఫలం దక్కుతుందని ఖురాన్ ప్రబోధిస్తోంది.

రంజాన్ మాసం ఏం చెబుతోంది..

రంజాన్ మాసంలో చేసిన ఆరాధనలు, ఆచరించిన ఉపవాసాలు, సత్‌క్రియలన్నీ మనం పెంచే మొక్కల్లాంటివే. మొక్క నాటి నప్పటి నుంచి నీరు పోసి సంరక్షించినప్పుడే అది ఎదిగి ఫలాలను అందజేస్తుంది. లేకుంటే కాస్త పెరిగుతున్న సమయంలోనే వాడి పోతుంది. అలాగే రంజాన్ మాసంలో పాటించిన ఆరాధనలు, సత్‌క్రియలను మిగిలిన 11 నెలలూ ఆచరణలో పెట్టినప్పుడే వాటి ఫలాలు అనుభవించగలుగుతామని చెబుతోంది. విశ్వాసులు రంజాన్ తర్వాత వచ్చే 11 నెలలూ అల్లాహ్ వైపు తమ దృష్టి మరల్చాలన్నదే ఖురాన్ ఉద్బోధ.

నేడు జాగారణ..

వేయి మాసాల రాత్రుల కన్నా ఘనమైన రాత్రి లైలతుల్‌ఖదర్ అని ముస్లింలు విశ్వసిస్తారు. ఈ రాత్రే అల్లా ఆజ్ఞ మేరకు దివి నుంచి భువికి దైవ దూతల ద్వారా దివ్య ఖురాన్ అవతరించిందని నమ్మకం. ఖురాన్ ఆవిర్భావాన్ని పురస్కరించుకుని ఆ రోజు రాత్రంతా ప్రత్యేక ప్రార్థనలతో ముస్లింలు జాగరణ చేస్తారు. ఇందుకు శనివారం వేదికై ంది. రాత్రి నుంచి శుభోదయం వరకూ మేల్కొని దైవరాధనలో గడపడం వల్ల గత 11 నెలలుగా చేసిన పాపాలను అల్లాహ్ క్షమిస్తాడని ముస్లింల విశ్వాసం. అందుకే షబేఖదర్‌ను ఇన్సాఫ్‌కే రాత్ (న్యాయ నిర్ణేత రాత్రి) అని కూడా భావిస్తుంటారు. ఈ నేపథ్యంలో షబేఖదర్‌ను షబేఖదర్‌ను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముస్లింలు సిద్ధమయ్యారు.

సకల పాపాలు ప్రక్షాళన



రంజాన్ మాసంలో షబేఖదర్ పేరుతో చేసే జాగరణ సకల పాపాలను ప్రక్షాళన చేస్తుంది. ఈ రాత్రి నమాజ్‌లో విధిగా అందరూ పాల్గొనాలి. ఇబాదత్ చేస్తే వెయ్యి మాసాల పుణ్యఫలం దక్కుతుంది. ఇది చాలా ప్రత్యేకమైన రాత్రి. మనస్ఫూర్తిగా ప్రార్థిస్తే అల్లాహ్ మనం గతంలో చేసిన పాపాలన్నింటిని తుడిచేసి పుణ్యఫలాలను అందజేస్తారని ఖురాన్ ప్రబోధిస్తోంది.
– కరీంసాహెబ్, ముతవల్లి, బత్తలపల్లి

రైల్ కోచ్ రెస్టారెంట్ ప్రారంభం

గుంతకల్లు: రైలు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పనే ధ్యేయమని డీఆర్ఎం వినీత్‌సింగ్ స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం స్థానిక రైల్వే జంక్షన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రైల్ కోచ్ రెస్టారెంట్‌ను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. వంటగదిని, ఫర్నిచర్‌తోపాటు కోచ్‌కు వివిధ రకాల పెయింటింగ్‌లకు కితాబునిచ్చారు. ప్రాంగణంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వివిధ రకాల బొమ్మలు ఎంతో ఆకర్షణీయంగా ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైల్ కోచ్ రెస్టారెంట్‌లో భోజనానికి, అల్పాహారానికి వచ్చే ప్రయాణికులు, పట్టణ ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన పదార్థాలను అందించాలని నిర్వాహకులకు సూచించారు. ముఖ్యంగా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ డీసీఎం మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

14న గిరిజనుల ఆత్మీయ సమావేశం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి, వడిత్యా శంకర్‌నాయక్, తదితరులు

ధర్మవరం: ఈ నెల 14న ముదిగుబ్బలోని సొసైటీ గ్రౌండ్‌లో గిరిజనుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు గిరిజన ప్రజా సమాఖ్య వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వడిత్యా శంకర్ నాయక్ తెలిపారు. శుక్రవారం ధర్మవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డితో కలసి ఆత్మీయ సమావేశం పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా ప్రతి 500 జనాభా ఉన్న తండాలను పంచాయతీలుగా మార్చి నవశకానికి బాటలు వేసిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కేతిరెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయక్, జెడ్పీటీసీ సేవే నాయక్, ఎంపీటీసీ హరినాయక్, సర్పంచ్ మునిస్వామినాయక్, సీనియర్ నాయకులు రాందాస్ నాయక్, కుళ్లాయప్ప నాయక్, ప్రవీణ్‌కుమార్ నాయక్, తిరుపాల్ నాయక్ పాల్గొన్నారు.

ఓటరు కార్డుకు 31 ఏళ్లు





హిందూపురం అర్బన్: ఎన్నికల సమయంలోనే కాదు... ఇతర అత్యవసరాలకు గుర్తింపు కోసం ఉపయోగపడే ఓటరు కార్డు రూపకర్త ఎవరు? ఎప్పుడు వచ్చిందో మీకు తెలుసా? తెలియకపోతే కచ్చితంగా తెలుసుకుందాం రండి... 1950, జనవరి 25న భారత ఎన్నికల కమిషన్ ఏర్పాటైనప్పటి నుంచి 1993 వరకూ ఓటరు గుర్తింపుకార్డులనేవి లేనేలేవు. అయితే దొంగ ఓటర్లను నివారించి ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలనే సదుద్దేశ్యంతో సరిగ్గా 31 ఏళ్ల క్రితం 1993లో అప్పటి కేంద్ర ఎన్నికల కమిషనర్ టీఎన్ శేషన్ వినూత్న సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలోనే పుట్టుకు వచ్చిన ఓటరు కార్డు ఓ వజ్రాయుధంలా మారింది. తొలిదశలో నలుపు–తెలుపు రంగులో ఉన్న ఓటరు కార్డులను కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసింది. ప్రస్తుతం డిజిటల్ రూపంలో ముద్రించిన కార్డులు అందుబాటులోకి వచ్చాయి.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

EDUCATION

■ SINGLE SITTING : 10th, 12th, B.A. B.Com., B.Sc., M.A., M.Com., M.Sc., M.B.A, BBA, BCA, B.Tech., D.Ed., B.Ed., Agriculture, Pharmacy, Nursing, (For Drop outs / Back Logs) from recognised Universities. Exams in April/May. Cont ✆ : 73383 76874 [R-418]

REAL ESTATE

PLOTS FOR SALE

■ రాప్తాడు, బెంగళూరు హైవే AHUDA ఆమోదిత లేఅవుట్ మహతి గ్రూప్ PLEASANT VALLEY లో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర : 9121510333, 9392183377, 9281024684. [A-1917]

■ అనంతపురము, ఆలమూరు AHUDA ఆమోదిత లేఅవుట్ మహతి గ్రూప్ GMR కాలనీలో కొత్త విల్లా ఖాళీ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్రదించండి : 9121510333, 9392183377, 9281024684. [A-1916]

■ A.P. స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ హంపాపురం ప్రక్కన NH44 వద్ద AHUDA ఆమోదిత లేఅవుట్ మహతిగ్రూప్ హైవే కౌంటీలో కొత్త ఖాళీ ప్లాట్లు అమ్మకానికి కలవు. సంప్ర : 9121510333, 9392183377, 9281024684. [A-1918]

OPEN PLOTS FOR SALE

■ రాప్తాడు బెంగళూరు హైవే, నియర్ : MIG లేఔట్ 80 ఫీట్ రోడ్‌కి ఆనుకుని, శ్రీ లక్ష్మి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్‌లో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. లోన్ సౌకర్యం + స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. సంప్ర : 8074924603 [A-1790]

ప్లాట్లు అమ్మబడును

■ అనంతపురము టౌన్ మారుతీనగర్, గణేష్ హోటల్ వెనుక, నవయుగ ఎస్టేట్స్ వారు కొత్తగా ప్రారంభించిన సమృద్ధి అపార్ట్‌మెంట్ నందు డూప్లెక్స్ మరియు కొన్ని ప్లాట్లు మాత్రమే అమ్మకమునకు కలవు. కావలసినవారు సంప్రదించండి. సెల్ : 9440266241. [A-6278]

WANTED

■ Reputed Company Since 1990 Manufacturing Hoses & Water Tanks Required Freshers & Experienced Marketing Executive to Work in and Around Kurnool, Kadapa, Ananthapur District Contact: ALPHA POLYMERS. Mob : 9246633600. Email: aphydkarthi@gmail.com. Web: www.alphapolymers.in [HA-14090]

■ Need cook in Srinagar Colony for home (near 80 feet road), Anantapur, Ph: 9908000222 [C-718465]

■ ప్రముఖ విద్యాసంస్థ నందు పనిచేయుటకు Tele Callers కావలెను. Salary : 6000 - 15000/- for Girls. వయస్సు : 18-40. సంప్ర : 8019989913. [A-7265]

■ WANTED పంపుబాయ్స్, మేనేజర్, బెంగళూరు హైవే రాప్తాడు, నయారా పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు మేనేజర్, పంపుబాయ్స్ కావలెను. సంప్రదించండి : 9440270324. [A-1911]

■ N.R. ఫర్టిలైజర్ షాపునందు పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్ (బాలీ) అనుభవమున్న వారు MF కావలెను, జీతం-13,000, జొన్న బరస్ మార్ట్ దగ్గర, KLD రోడ్, అనంతపురం. ఫోన్: 90088 02705, 94411 87849. [A-1218]

■ డేటా ఎంట్రీ ఆపరేటర్ (FM) కావలెను. అనంతపురం నగరంలో ప్రముఖ రియల్ ఎస్టేట్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా (మహిళ) కావలెను. సెల్ : 9000958104 [A-1919]

■ కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ నందు వర్క్ చేయుటకు హెల్త్ అడ్వయిజర్స్ కావలెను. కమీషన్ + ఇన్సెంటివ్ ఇవ్వబడును. వెంటనే సంప్రదించండి : 9606206158. [A-784608]

■ ప్రముఖ బ్యాటరీ లూమినస్ డిస్ట్రిబ్యూటర్ నందు పనిచేయుటకు హెల్పర్స్ కావలెను. సంప్రదించండి : ✆79815 93818, 99859 88063. [C-718467]

■ తాడిపత్రి పట్టణంలోని IIFL గోల్డ్‌లోన్ బ్రాంచ్‌లో పగలు డ్యూటీ చేయుటకు స్థానికులైన సెక్యూరిటీ గార్డ్లు కావలెను. ESI, PF సౌకర్యం కలదు. వివరాల కోసం: 94940 32999. [L-806478]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185017]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520,89197 39694. [M-1233958]

■ Women Marketing Prenuers Welcome ! Job openings for Asst. Marketing Manager & Field Marketing Executives (Only FEMALES) to work in Buzz Groups (Holidays Packages, Currency Exchange etc.,) Exp : 0-4 years in service Industry, Qual : Intermediate / Any & Good Communication skills, No consultancy, No Part Time/No Joining fee. Place: Anantapur only, cell: 888 668 48 48. [A-784606]

■ ATP లోకల్, ప్రముఖ ఆఫీస్ నందు జాబ్ చేయుటకు 10th to PG అర్హత కలిగిన యువతీ యువకులు అర్జెంటుగా కావలెను. సెల్ : 9441977101. [A-1920]

■ WANTED DRIVERS ATP నయారా పెట్రోల్ బంక్ నందు పెట్రోల్ ట్యాంకర్ నడుపుటకు అనుభవం కల్గిన డ్రైవర్లు, కావలెను. సంప్రదించండి : 9440270324. [A-1915]

■ అనంతపురము టౌన్‌లో S.S. సెక్యూరిటీ సర్వీసెస్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ & సెక్యూరిటీ సూపర్ వైజర్స్ కావలెను. జీతం : 10,000 నుండి 15,000 వరకు ఉండును. 8247595187, 7981206754. [A-1909]

■ ప్రముఖ GNR ట్రేడర్స్ నందు పనిచేయుటకు సేల్స్‌మెన్ & Eicher వెహికల్ డ్రైవర్స్ కావలెను. జీతం : 15,000/- అనంతపురము లోకల్ వారికి మాత్రమే. సంప్రదించండి : ఫోన్ : 8143066551, 7981187143. [A-1914]

■ SBI లైఫ్ ఇన్సూరెన్స్ నందు అడ్వయిజర్స్ నియామకాలు జరుగుచున్నవి. నెలకు ఆదాయం రూ. 25,000/ + ఆపైన. కనీసం 10th క్లాస్ పాస్ అయి 25 సం॥ నిండి ఉండవలెను. వెంటనే సంప్ర :9849571330. [A-784610]

■ Wanted : (1) Cold Storage Plant Operators (ITI - Electrical, Exp - 2 Years) (2) Fruits & Vegetables - Procurement Field Supervisor 3) Sales Executive @ Fresh Cart Agro (P) Ltd, KLD Road, ATP (Interview : 08/04/2024) Cell : 8143697965, 9346612228. [A-1921]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడ మైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధన సీఎం జగన్‌తోనే సాధ్యం

- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి శంకరనారాయణ
- వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి


జగ్జీవన్‌రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న శంకరనారాయణ, పైలా నరసింహయ్య, గిరిజమ్మ తదితరులు

అనంతపురం కార్పొరేషన్: బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి బాటలు వేసి బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను సాధించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అనంతపురం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎం.శంకరనారాయణ కొనియాడారు. బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి శంకరనారాయణ, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, పార్టీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా నవరత్నాల ద్వారా బడుగుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చర్యలు చరిత్రాత్మకమన్నారు. నేడు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడ్డాయంటే అందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమన్నారు. కార్యక్రమంలో అనంతపురం నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెన్నపూస రామచంద్రారెడ్డి, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రాజారాం, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, మాజీ చైర్మన్ పామిడి వీరాంజనేయులు, నాయకులు అనిల్‌కుమార్‌గౌడ్, పురుషోత్తం, బంగి సుదర్శన్, ఓబులేసు, ఎం ఉష, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై పోక్సో కేసు నమోదు

రాయదుర్గం: బాలికను మాయమాటలతో లొంగదీసుకుని శారీరక అవసరాలు తీర్చుకున్న టీడీపీ నాయకుడిపై పోక్సో చట్టం కింద పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలను శుక్రవారం రాత్రి డి.హీరేహాళ్ ఎస్ఐ గురుప్రసాదరెడ్డి వెల్లడించారు. డి.హీరేహాళ్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 17 ఏళ్ల బాలికతో అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు బోయ ఆంజనేయులు పరిచయం పెంచుకున్నాడు. అనంతరం ప్రేమ పేరుతో మాయచేశాడు. మంచిమాటలతో నమ్మించి గత మార్చి 27న తన వెంట బెంగళూరుకు పిలుచుకెళ్లి తన శారీరక అవసరాలు తీర్చుకున్నాడు. ఈ నెల 4న అతని నిర్బంధం నుంచి బయటపడిన బాలిక సమాచారం ఇవ్వడంతో బంధువులు అక్కడకు చేరుకుని బాలికను తీసుకుని తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. జరిగిన దారుణాన్ని తెలుసుకున్న తల్లిదండ్రుల వేదనకు అంతు లేకుండా పోయింది. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆంజనేయులుపై డి.హీరేహాళ్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను ఆస్పత్రిలో చేర్పించారు. కాగా, హొసగుడ్డంలో టీడీపీ నాయకుడు లోకేష్ ప్రవర్తనపై విసుగుచెంది కురుబ కావేరి అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగిన 24 గంటలు గడవక ముందే మరో గ్రామంలో టీడీపీ నాయకుడి అకృత్యాలు వెలుగుచూడడం గమనార్హం.

కారు ఢీ... వ్యక్తి మృతి

మడకశిర రూరల్: కారు ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం బి.రాయాపురం గ్రామానికి చెందిన బుడెన్‌సాహెబ్ (38) శుక్రవారం ఉదయం తన స్కూటీ వాహనంపై మడకశిరకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని అయ్యవారిపల్లి బస్టాండ్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకువచ్చిన ఇన్నోవా కారు ఢీకొంది. ఘటనలో తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితికి చేరుకున్న ఆయనను స్థానికులు ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. మృతునికి భార్య, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

లక్ష్యాన్ని అధిగమించిన 'మార్కెటింగ్'

- రూ.10.81 కోట్లకు గానూ రూ.11.31 కోట్ల వసూలు
- 105 శాతంతో గడువులోపు లక్ష్యాన్ని సాధించిన వైనం
- 135 శాతం వసూళ్లతో అగ్రస్థానంలో శింగనమల మార్కెట్



అనంతపురం అగ్రికల్చర్: మార్చి నెలాఖరుతో ముగిసిన 2023–24 గత ఆర్థిక సంవత్సరంలో మార్కెటింగ్‌శాఖ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించింది. జిల్లాలో ఉన్న 9 మార్కెట్‌యార్డు కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో పన్ను వసూళ్ల రూ.10.81 కోట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, గడువు ముగిసేనాటికి 105 శాతంతో రూ.11.31 కోట్ల మేర సాధించింది. గతేడాది కూడా 105 శాతం లక్ష్యం సాధించడం విశేషం. ఈ ఏడాది వర్షాభావంతో కరువు పరిస్థితులు ఏర్పడినా లక్ష్యాన్ని చేరుకోవడంతో ఆ శాఖ కమిషనరేట్ అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. పశువులు, జీవాల సంతలు, చీనీ, చింతపండు, ఎండుమిరప అమ్మకాలతో పాటు వ్యవసాయోత్పత్తుల అమ్మకాలు, రవాణా, గోదాములు, దుకాణాల అద్దె తదితర వాటి ద్వారా అనుకున్న మేర వసూళ్లు చేయడంతో లక్ష్యం పూర్తయినట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

అన్నింటా శింగనమల టాప్

ఈ ఏడాది రూ.75 లక్షల వసూళ్ల టార్గెట్ పెట్టుకున్న శింగనమల మార్కెట్ కమిటీ దూకుడు కొనసాగించింది. డిసెంబర్‌లోనే లక్ష్యాన్ని చేరుకున్న కమిటీ గడువు ముగిసేనాటికి 135 శాతంతో రూ.89.60 కోట్లు సాధించింది. శింగనమలతో పోటీ పడిన అనంతపురం వ్యవసాయ మార్కెట్‌కమిటీ కూడా 105 శాతంతో రూ.4.10 కోట్లకు గానూ రూ.4.27 కోట్లకు పైగా వసూలు చేసింది. ఉరవకొండ కమిటీ రూ.76 లక్షలకు గానూ 118 శాతంతో రూ.89.36 లక్షలు, కళ్యాణదుర్గం రూ.52 లక్షలకు గానూ 117 శాతంతో రూ.61.01 లక్షలు, రాయదుర్గం రూ.1.20 కోట్లకు గానూ 110 శాతంతో రూ.1.32 కోట్లు, తాడిపత్రి రూ.1.85 కోట్లకు గానూ 102 శాతంతో రూ.1.90 కోట్లు, రాప్తాడు కమిటీ రూ.50 లక్షలకు గానూ 99 శాతంతో రూ.49.54 లక్షలతో దాదాపు లక్ష్యాన్ని చేరుకుంది. కేవలం గుంతకల్లు, గుత్తి మార్కెట్ కమిటీలు లక్ష్యాన్ని చేరుకోలేక చతికిలపడ్డాయి. గుంతకల్లు రూ.85 లక్షలకు గానూ 69 శాతంతో రూ.58.56 లక్షలు, గుత్తి రూ.28 లక్షలకు గానూ 77 శాతంతో రూ.21.61 లక్షలు మాత్రమే వసూలు కావడంతో వెనుకంజలో నిలిచాయి. గతేడాది రూ.10.85 కోట్లు వసూలు కాగా ఈ సారి రూ.46 లక్షల వరకు అధికంగా వసూలు కావడం విశేషం.

స్కార్పియో ఢీకొని వ్యక్తి మృతి


జగన్నాథరెడ్డి (ఫైల్)


జగన్నాథరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

కూడేరు: స్కార్పియో వాహనం ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి మృతి చెందాడు. ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన మేరకు... కూడేరు మండలం కలగళ్లకు చెందిన జగన్నాథరెడ్డి(42)కి భార్య వాసవి, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఓ ప్రైవేట్ ఫర్టిలైజర్ కంపెనీలో సేల్స్‌మెన్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుక్కరాయసముద్రం మండలం బొమ్మలాటపల్లిలో బంధువుల ఇంట పెళ్లి వేడుకకు హాజరయ్యేందుకు శుక్రవారం ఉదయం భార్య వాసవితో కలసి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. కూడేరులోని సాయిబాబా ఆలయ సమీపానికి చేరుకోగానే ప్రధాన రహదారిపై ఎన్నికల కోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్దకు చేరుకోగానే వరుసగా వెళుతున్న కార్లను తనిఖీ చేసేందుకు ఆపే ప్రయత్నం చేశారు. చివరన వేగంగా దూసుకొచ్చిన స్కార్పియో వాహన డ్రైవర్ ముందు కార్లను ఢీ కొనకుండా ఉండేందుకు ఉన్నఫలంగా తన వాహనాన్ని కుడివైపు తిప్పాడు. అదే సమయంలో ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొనడంతో జగన్నాథరెడ్డి, వాసవి ఇద్దరూ ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఘటనలో జగన్నాథరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. వాసవికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే ద్విచక్ర వాహనంలో షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుని ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. గాయపడిన వాసవిని 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన స్కార్పియో వాహనం ధర్మవరం మాజీ ఎమ్మెల్యే వరదాపురం సూరి ప్రధాన అనుచరుడిదిగా పోలీసులు గుర్తించారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వై.విశ్వేశ్వరరెడ్డి కలగళ్లకు చేరుకుని మృతుడికి నివాళుర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి


చెర్లోపల్లిలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడు: టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొని తెచ్చుకున్నట్లే అని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాలబావి, ఎం.చెర్లోపల్లి, ఎం.క్రిష్టాపురం, రామినేపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సీనియర్ మహిళా నాయకురాలు గంగుల భానుమతితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వీరికి మహిళలు హారతులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి పథకాలను వివరించారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమల చేశామన్నారు. అర్హులైన పేదలందరికీ నవరత్నాల ద్వారా పథకాలు అందజేశామన్నారు. ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. చివరకు వలంటీర్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్లు ఇచ్చే ప్రక్రియను సైతం అడ్డకుంటున్నారన్నారు. ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచన చేయాలన్నారు. వేసే ఓట్లు మన పిల్లలు, మన భవిష్యత్తుకు మేలు చేసేలా ఉండాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా సంక్షేమం, అభివృద్ధి దూరమవుతుందన్నారు. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామన్నారు. ఇప్పటికే 2 వేల మంది రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి రాగానే మరో 5 వేల మందికి బోర్లు వేపిస్తామన్నారు. గార్మెంట్ ఫ్యాక్టరీలు నిర్మించి 4 వేల మంది మహిళలకు ఉపాధి కల్పిస్తామన్నారు. అమ్మ డెయిరీ ద్వారా 56 గ్రామాల్లో పాలు సేకరిస్తున్నామని తెలిపారు. 150 గ్రామాల్లో విస్తరించేలా మహిళలకు అండగా నిలబడతామన్నారు. కనగానపల్లి మండలానికి 1,350 మెగా వాట్ల సోలార్ ఫ్యాక్టరీ తీసుకొచ్చి, 3 వేల మందికి ఉపాధి కల్పిస్తున్నామన్నారు. రామగిరి మండలంలో బంగారు గనులు తెరిపించామని.. సర్వే పనులు పూర్తి చేశామన్నారు. త్వరలోనే 3 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 35 దేవాలయాలు నిర్మించేందుకు టీడీపీ ద్వారా నిధులు ఇప్పించామన్నారు. ప్రకాష్ రెడ్డి వచ్చిన తర్వాత ఏమీ చేశాడో చెప్పడానికి రికార్డు ఉందన్నారు. అయితే పరిటాల సునీత ఉన్నప్పుడు ఏమీ చేసిందో చెప్పడానికి రికార్డు లేదని ఎద్దేవా చేశారు.

అన్ని చెరువులకు తాగు, సాగు నీరు

హంద్రీ–నీవా కాలువ ద్వారా పాలబావి, ఎం.చెర్లోపల్లి, మరూరు, చాపట్ల గ్రామాలకు తాగు, సాగు నీరు అందించేందుకు కాలువ పనులు 90 శాతం పూర్తి అయినట్లు చెప్పారు. మిగిలిన 10 శాతం పనులు పూర్తి చేసి వచ్చే సంవత్సరం మీ చెరువులకు నీటిని అందిస్తామన్నారు. హంద్రీనీవాను వైఎస్ రాజశేఖర్ రెడ్డి పూర్తి చేశారని, ఆ కాలువ ద్వారా అన్ని చెరువులకు నీటిని అందిస్తామన్నారు. తోపుదుర్తి రిజర్వాయర్‌కు సీఎం జగన్‌మోహన్ రెడ్డి భూమి పూజ చేశారన్నారు. డ్యాం పూర్తి అయితే రాప్తాడు మండలంలో 20 వేల ఎకరాలకు సాగు నీటిని అందించి.. రాప్తాడు మండలాన్ని సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గొర్రెలు, మేకల సొసైటీ చైర్మన్ పసుపుల నరసింహ గౌడ్, ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిత్రా వెంకటేష్, ఎంపీటీసీ భోగం లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు రాకుండా అడ్డు పడింది పరిటాల సునీతే

మండలంలోని పాలబావి, ఎం.చెర్లోపల్లి గ్రామాలకు రోడ్డు రాకుండా టీడీపీ అభ్యర్థి పరిటాల సునీత అడ్డుపడ్డారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి తెలిపారు. 44వ జాతీయ రహదారి నుంచి ఎం.చెర్లోపల్లి రోడ్డు వేసేందుకు పరిటాల సునీత, ఆమె తమ్ముడు ధర్మవరం మురళి, ఆమె చిన్నాన్న నారాయణ చౌదరి శ్రీ కృష్ణదేవరాయ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పేరు మీదుగా 2019లో కాంట్రాక్టు తీసుకుందన్నారు. ఆమె ఆ ఎన్నికల్లో ఓడిపోవడంతో చెర్లోపల్లి మీద కక్ష కట్టి రోడ్డు వేయలేదన్నారు. కాంట్రాక్టర్ పరిటాల సునీత అని.. ఒక టీవీ ఇంటర్వ్యూలో మాకు ధర్మవరం, రాప్తాడు నియోజకవర్గాల్లో 35 రోడ్లు వచ్చాయని చెప్పినట్లు గుర్తు చేశారు. కాంట్రాక్టు వచ్చినా కూడా పనులు చేయలేదని మండిపడ్డారు. మళ్లీ ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో ఓట్లు వస్తే రోడ్డు వేస్తామంటూ అబద్ధపు హామీలు ఇస్తారని తెలిపారు. 5 ఏళ్లుగా మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేసిన వీరికి బుద్ధి చెప్పాలన్నారు. ఈనెల చివరికి వారి పేరు మీద కాంట్రాక్ట్ రద్దు అవుతుందని.. కొత్త కాంట్రాక్టర్లతో త్వరలోనే రోడ్డు నిర్మాణం చేపడుతామని హామీ ఇచ్చారు.

చరిత్రాత్మకంగా ఉద్యోగాల భర్తీ

- సచివాలయ వ్యవస్థతో నిరుద్యోగ యువతకు మెండుగా ఉపాధి కల్పించాం
- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 24వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'


మహిళను ఆప్యాయంగా పలకరిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: దేశ చరిత్రలోనే ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ ద్వారా 1,30,000 మందికి ఉద్యోగాలు కల్పించామని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని 24వ డివిజన్ నవోదయ కాలనీలో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అందించిన సంక్షేమం, జరిగిన అభివృద్ధిని వివరించడంతో పాటు రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే స్థానిక ప్రజలతో ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ఉపాధి కల్పన గురించి మాట్లాడారు. లక్షలాది మంది నిరుద్యోగులుగా ఉంటూ ఇబ్బంది పడుతున్న సమయంలో 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. నగరంలోని 74 సచివాలయాలను ఏర్పాటు చేసి అందులో సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. వివిధ సచివాలయాల పరిధిలో 99.99 శాతం మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారని తెలిపారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ప్రొబేషన్ డిక్లేర్ చేసిన గొప్ప నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని కొనియాడారు. వీరితో పాటు నగరంలో 1,100 మందికి పైగా వలంటీర్లుగా అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. సచివాలయాల్లో 560 రకాల సేవలు ప్రజలకు అందుతున్నాయన్నారు. వైద్య రంగంలో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న వేల పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. తద్వారా ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు వివిధ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందుతున్నట్లు తెలిపారు.

గత ప్రభుత్వాలు ఎందుకు చేయలేకపోయాయి?

2014 ఎన్నికలకు ముందు టీడీపీ నాయకులు బాబు వస్తే జాబు అంటూ ప్రచారం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోను పత్తా లేకుండా చేసి నిరుద్యోగ యువతను నట్టేట ముంచారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పారని.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అనతి కాలంలోనే ఉద్యోగాలను భర్తీ చేశారని పేర్కొన్నారు. ఉపాధి గురించి అది చేస్తాం.. ఇది చేస్తామంటూ చెబుతున్న మాజీ సీఎం చంద్రబాబు నాయుడు ఎందుకు ఈ స్థాయిలో ఉపాధి కల్పించలేకపోయారో చెప్పాలన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయని ఇవాల ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రజలు ఈ విషయాలను గుర్తు చేసుకోవాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గొప్ప విజన్ కలిగిన నాయకుడన్నారు. కేవలం ఐదేళ్లలోనే దేశంలోని ఇతర రాష్ట్రాలు ఏపీను ఆదర్శంగా తీసుకునే స్థాయికి తీసుకెళ్లారన్నారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉంటే ఊహకందని అభివృద్ధి, సంక్షేమం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ముందు చూపుతో ఆలోచించి, మన భవిష్యత్తు కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, టీటీడీ బోర్డు సభ్యులు అశ్వర్థ నాయక్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, పార్టీ జోనల్ ఇన్‌చార్జ్‌లు రమేష్‌గౌడ్, రిలాక్స్ నాగరాజు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వెన్నం శివరామిరెడ్డి, నగర కన్వీనర్ చింతా సోమశేఖర్ రెడ్డి, పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉమాపతి, కార్పొరేటర్లు సంపంగి రామాంజనేయులు, కమల్‌భూషణ్, లీలావతి, దుర్గాదేవి, అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, నాయకులు లింగాల రమేష్, ఆలమూరు శ్రీనివాస్‌రెడ్డి, రామయ్య, మన్నల సత్యనారాయణ, జావెద్, అనిల్‌కుమార్ గౌడ్, పోతులయ్య, అబ్దుల్, ఆర్‌ఏ కటిక సంఘం నాయకులు సాయినాథ్, కృష్ణ చైతన్య, నాగరాజు, గౌరి, భారతి, అనిత, రాజేశ్వరి, పార్వతి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

నేడు 25వ డివిజన్‌లో..

నగరంలోని 25వ డివిజన్ హౌసింగ్ బోర్డులో శనివారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు వెంకటేశ్వర స్వామి దేవాలయం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

క్లుప్తంగా

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి

రాప్తాడు: మండల కేంద్రానికి చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం అనంతపురంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాప్తాడుకు చెందిన నాగరాజు, వెంకటేష్, మోహన్, శేఖర్, పెద్దప్పయ్య, ముత్యాలప్ప, క్రిష్ణ, రాజేష్, ముత్యాలు, రామాంజినేయులు, రామాంజి పార్టీలో చేరారు. వీరికి తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎల్‌వీసీ వెంకటరాముడు, జయన్న, గంజి అభి తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రానికి చెందిన వార్డెన్ నాగరాజు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. శుక్రవారం మృతుడి భార్య వెంకటలక్ష్మి వారి కుమారులు, కుమార్తెను ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గోవిందరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు డోలా రామచంద్రారెడ్డి, నాయకులు గాలి శ్రీనివాసరెడ్డి, తాతిరెడ్డి, నరసింహా రెడ్డి, పుల్లారెడ్డి, ఎస్టీడీ శ్రీనివాసరెడ్డి, మనేరు నరసింహులు, రామకృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, ఓబుళేసు పాల్గొన్నారు.

గుత్తా హరికి ఉగాది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న గుత్తా హరి

అనంతపురం కల్చరల్: జిల్లాకు చెందిన సీనియర్ కవి, సాహిత్యభారతి అధ్యక్షుడు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు ఉగాది పురస్కారం అందుకున్నారు. శుక్రవారం నెల్లూరులో ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో అనంత తరఫున సీమ సంస్కృతిని చాటుతూ స్వీయకవిత వినిపించారు. ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి, ప్రముఖ విద్యావేత్త లతీఫ్‌కుట్టి, అబ్దుల్ రజాహుస్సేన్, డాక్టర్ గోపి కృష్ణ తదితరులు హరిని ఘనంగా సత్కరించారు.

జంగాలపల్లి మసీదులో ఇఫ్తార్ విందు


ఉపవాస దీక్షాపరులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కల్చరల్: స్థానిక పాతూరులోని జంగాలపల్లి మసీదులో శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆత్మీయ అతిథిగా హాజరై, ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షాపరులు స్వయంగా వడ్డించి రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మాజీ మేయర్ పరుశురాం, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధి ఖాజా, తదితరులు ఉపవాస దీక్షాపరులతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. రంజాన్ అందరిలో సంతోషం నింపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు కట్టుబడి తానీషా, మహబూబ్ బాషా, హబీబుల్లా, జావీద్, నవీద్, ఆదం తదితరులు పాల్గొన్నారు.


ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

ముస్లింలతో కలిసి ప్రార్థనలు

రాప్తాడురూరల్: ముస్లింలకు పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం అనంతపురం రూరల్ మండలం పాపపేంట, కక్కలపల్లి కాలనీ పంచాయతీ పిల్లిగుండ్లకాలనీ, నందమూరి నగర్‌లో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ముస్లిం సోదరులతో కలిసి ఎమ్మెల్యే ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, జిల్లా మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ మునాఫ్, రాప్తాడు ఖాదీషా గులాం రసూల్, జెడ్పీటీసీ సభ్యుడు చంద్ర, ఎంపీటీసీ సభ్యుడు సందీప్, వెంకటేష్, మాదన్న, ఈశ్వరయ్య, కక్కలపల్లి పంచాయతీ ఎంపీటీసీ సభ్యుడు వడ్డే శ్రీనివాసులు, డాక్టర్ శీన పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం

కనగానపల్లి: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని గెలిపించి రాప్తాడులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దామని వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. మండలంలోని తగరకుంట పంచాయతీ పరిధిలోని కేకే తాండా, పీకే తాండాలలో శుక్రవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీ తరఫున పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. టీడీపీ కూటమి నాయకులు ఇస్తున్న దొంగ హామీలను నమ్మకుండా వైఎస్సార్‌సీపీకే మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతి, అగ్రిబోర్డు చైర్మన్ వెంకటరాముడు, పార్టీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరక్టర్ ప్రభాకర్,


తగరకుంట కేకే తండాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులు

వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ జగదీష్‌గౌడ్, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, పెద్దిరెడ్డి, మాధవరెడ్డి, చంద్రా, సుధాకర్‌రెడ్డి, ముత్యాలప్ప, పెదక్క, గోవిందురెడ్డి, శీనా, మల్లికార్జున పాల్గొన్నారు.

సతామికి సర్వం సిద్ధం

అనంతపురం కల్చరల్: 'షైలతుల్ ఖద్ర్'గా పలవబడే సతామి సామూహిక ప్రార్థనలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగనున్నాయి. చివరి శుక్రవారం రాత్రి తరావీ నమాజులో వేలాది మంది మసీదుల్లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వెయ్యి నెలల పుణ్యఫలంగా భావించే సతామి గురించి పవిత్ర గ్రంథంలోని 26వ పారా (హమీమ్) ప్రత్యేకంగా చెపుతుందని మతపెద్దలు తెలిపారు. పవిత్ర ఖురాన్ అవతరించిన రాత్రిగా భావించడం వల్ల సతామికి ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉపవాసాలు అంతిమ దశకు చేరుకునే దశలో వచ్చే ఈ పవిత్ర రోజున ప్రత్యేక ప్రార్థనలుంటాయని తెలిపారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్


మాట్లాడుతున్న బిగ్ బాస్ ఫేమస్ అమర్ దీప్

రాప్తాడు: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బిగ్ బాస్ ఫేమస్ అమర్ దీప్ అన్నారు. మండలంలోని హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో క్రాష్ 2కే 24 కళాశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. ముందుగా కళాశాలలో జేఎన్‌టీయూఏ కౌన్సిల్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ బి.జోజిరెడ్డి చేతుల మీదుగా జెండా ఎగురవేసి స్పోర్ట్స్ డే వేడుకలు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథి బిగ్ బాస్ ఫేమస్ అమర్ దీప్ మాట్లాడారు. విద్యార్థులు కేవలం చదువుపైనే ఆసక్తి చూపుతున్నారన్నారు. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమే అన్నారు. ఆరోగ్యవంతమైన జీవితం, మనిషి ఎప్పుడూ హుషారుగా ఉండే శక్తి కేవలం క్రీడలతో సాధ్యమవుతుందని తెలిపారు. రోజూ క్రీడలకు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. జేఎన్‌టీయూఏ కౌన్సిల్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ బి.జోజిరెడ్డి మాట్లాడుతూ.. భావి ఇంజనీర్లకు రాను రాను క్రీడల పట్ల ఆసక్తి తగ్గుతోందన్నారు. క్రీడల్లో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని తెలిపారు. అనంతరం కళాశాలలో క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ బీ.వీ.ఆర్.శర్మ, చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ వెన్నపూస రవీంద్రా రెడ్డి, ఎండీ రమాకాంత్ రెడ్డి, సీఈఓ ఆనంద్ కుమార్, ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, ఏఓ శివా రెడ్డి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి


నవోదయ కాలనీలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కార్పొరేషన్: అణగారిన వర్గాల అభ్యున్నతికి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చేసిన పోరాటాలు మరువలేనివని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని 24వ డివిజన్ నవోదయ కాలనీలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ అతి చిన్న వయస్సులోనే స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నారన్నారు. సమ సమాజ స్థాపనకు, ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు పోరాటాలు చేశారన్నారు. అంబేడ్కర్ రాజ్యాంగపరంగా దళితులు, అణగారిన వర్గాలకు హక్కులు కల్పిస్తే.. అవి చట్టరూపంగా మార్చి అమలు పర్చడంలో అనేక కష్టాలు ఎదుర్కొని దళితులను చైతన్యవంతం చేశారని తెలిపారు. శాసనసభ్యుడిగా, పార్లమెంట్ సభ్యుడిగా, కేంద్ర మంత్రిగా ఎన్నో పదవులను చేపట్టి గొప్ప రాజకీయవేత్తగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వైస్ చైర్మన్ ఓబిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జగ్జీవన్‌రామ్ జయంతిని జరుపుకున్నారు. నగరంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌టీఏ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్ మాట్లాడారు. బాబూజీగా ప్రసిద్ధి చెందిన జగ్జీవన్ రామ్ జాతీయ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక న్యాయ పోరాట యోధుడు, అణగారిన వర్గాల ఆశాదీపం అన్నారు. భారత జాతికి


నినాదాలు చేస్తున్న వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు

చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు గోపాల్, సతీష్, కృష్ణా నాయక్, వెంకటరెడ్డి, పవన్ కుమార్, సిద్దప్రసాద్, నరసింహ రెడ్డి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ హెచ్ఎం, ఎంఈఓల సంఘం ఆధ్వర్యంలో..

ఎస్సీ, ఎస్టీ హెచ్ఎం, ఎంఈఓల సంఘం ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తారాచంద్ర నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గురుప్రసాద్, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు గోపాల్ నాయక్, ప్రధాన కార్యదర్శి మహేశ్వర్, డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబు పాల్గొన్నారు.

సీతమ్మకు సారె సమర్పణ


పూజలు చేస్తున్న వేదపండితులు

అనంతపురం కల్చరల్: మునుపెన్నడూ లేని విధంగా రామాయణంలోని ప్రధాన ఘట్టమైన సీతమ్మకు సారె సమర్పణ కార్యక్రమం ఘనంగా సాగింది. 60 ఏళ్లకు ఒకసారి మాత్రమే ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించడం మొట్టమొదటిసారి కావడంతో వివిధ రికార్డుల్లో నమోదు చేశారు. శుక్రవారం స్థానిక కొత్తూరు అమ్మవారి శాలలో సాయిట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన విలక్షణ ఘట్టాన్ని ప్రముఖ ఆకాశవాణి వ్యాఖ్యాత జగర్లపూడి శ్యామసుందర శాస్త్రి కళ్లకు కట్టినట్టు వివరిస్తూ నడిపించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా 900 మంది మహిళలకు సీతమ్మ వారి సారెను వడిబియ్యంగా అందించారు. అలాగే సీతారాముల కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, ఎదుర్కోళ్ల వంటి ఘట్టాలను ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన త్రిదండి చిన్నజీయర్ స్వామీజీ శిష్యబృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ట్రస్టు వ్యవస్థాపకుడు విజయ్‌కుమార్ నేతృత్వంలో వేలాది మందికి ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో కొత్తూరు అమ్మవారి శాల నిర్వాహకులతో పాటూ కార్యక్రమ నిర్వాహకులు శ్వేతా రాఘవేంద్ర, నారాయణ నాయక్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి కృత్రిమ కాలు అందజేత

అనంతపురం కల్చరల్: ఓ అభాగ్యుడికి కృత్రిమ కాలు అందజేసి, అండగా నిలిచారు అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి. వివరాలు బీకేఎస్ మండలం భద్రంపల్లి గ్రామానికి చెందిన తరుణ్ పీలేరు ఎంజీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో కాలు పోగొట్టుకున్నాడు. అసలే పేదరికం దానికి తోడు తండ్రి మరణించడంతో తల్లి కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. వీరి పరిస్థితిని తెలుసుకున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమల రమణారెడ్డి వైద్యులను సంప్రదించారు. జర్మన్ టెక్నాలజీ ఆర్టిఫీషియల్ లెగ్ అమర్చడానికి ముందుకొచ్చారు. రూ.60 వేల ఖరీదు చేసే కృతిమ కాలును తరుణ్‌కు అందించాడు. చదువుకునేందుకు తక్షణసాయంగా రూ.15 వేలు అందజేశారు. భవిష్యత్తులో ఆదుకుంటానని భరోసా నిచ్చారు. అంగవైకల్యం చదువుకు ఆటంకం కారాదని.. బాగా చదువుకుని సమాజానికి ఉపయోగపడాలని సూచించారు.


తరుణ్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

నాటు సారా ఊట ధ్వంసం

గుత్తి: కర్నూలు జిల్లా చెరువు తాండా సమీపంలో శుక్రవారం గుత్తి సెబ్ పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. దాడుల్లో 2,800 లీటర్ల నాటు సారా బెల్లం ఊటను ధ్వంసం చేశారు. పోలీసుల రాకను పసిగట్టిన ముగ్గురు నిందితులు పరారీ అయ్యారు. పోలీసులు మూడు బైక్‌లు సీజ్ చేశారు. 120 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ సీఐ శివసాగర్, ఎస్ఐ సునీల్ కుమా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

10లోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంతకల్లుటౌన్: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయదలచిన విద్యార్థులు ఈనెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎగ్జామినేషన్ కో–ఆర్డినేటర్ అష్రఫ్ అలీ శుక్రవారం తెలిపారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారితో పాటు పాసైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక కళాశాలలో దరఖాస్తుదారుల కోసం ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు.

ఉరవకొండ లయన్స్ క్లబ్‌కు అత్యధిక పురస్కారాలు

ఉరవకొండ: 2022–23 సంవత్సరానికి ఉరవకొండ లయన్స్‌క్లబ్‌కు అత్యధిక పురస్కారాలు దక్కినట్లు క్లబ్ అధ్యక్షుడు జయకృష్ణ శుక్రవారం తెలిపారు. ఎక్సలెంట్ క్లబ్ అధ్యక్షుడిగా సప్తగిరి మల్లికార్జున, మెమొరబుల్ రీజనల్ చైర్మన్‌గా కొమ్మసాని బాలచంద్ర, ఎక్సలెంట్ జిల్లా చైర్మన్‌గా టి.గణేష్‌బాబు, బెస్ట్ రికగ్నైజ్డ్ జిల్లా చైర్మన్‌గా చిట్టా శ్రీధర్, ఉత్తమ కేబినెట్ అడ్వైజర్‌గా ప్రభాకర్‌నాయుడు, ఉత్తమ రీజనల్ కార్యదర్శిగా ఎంసీ జయకృష్ణ, గవర్నర్ అప్రెసియేషన్ జిల్లా చైర్మన్‌గా నాగేశ్వరావు, అప్రిసియేషన్ జిల్లా చైర్మన్‌గా మిడతల విశ్వనాథ్, అప్రిసియేషన్ జిల్లా చైర్మన్‌గా జీకె శ్రీధర్, న్యూవాయిస్ ఎం.సురేంద్ర ఎంపికయ్యారు. వీరికి ఈనెల 7న ప్రొద్దుటూరులో అవార్డులు అందజేయనున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

తాడిపత్రి అర్బన్: మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆమె నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ ఎస్ఐ గౌస్‌బాషా తెలిపారు. శుక్రవారం పట్టణంలోని గాంధీనగర్‌లో మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం అందుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ వన్నూర్ అనే మహిళను అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితురాలిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727

దేశం నిశ్శబ్దంగా ఒక ముఖ్యమైన జనాభా మార్పుకు గురవుతోంది.
ఇండియా ఏజింగ్ రిపోర్ట్ 2023 ప్రకారం దేశ జనాభాలో 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల వారు దాదాపు 15 కోట్ల మంది ఉన్నారు.
ఈ సంఖ్య 2050 నాటికి రెట్టింపు అయ్యే అవకాశం ఉంది.
సంతానోత్పత్తి రేటు తగ్గడం, అందుబాటులోకి వచ్చిన చికిత్సా విధానాల వల్ల భారతదేశ జనాభాలో వృద్ధుల వాటా నిశ్శబ్దంగా పెరుగుతోంది.
అయితే, దీనికి తగినట్టుగా వారి ఆర్థిక శక్తి పెరగడం లేదు.
ఫలితంగా వృద్ధులు సొంత కుటుంబాల నుంచే ఈసడింపులకు, వేధింపులకూ గురవుతున్నారు.
వృద్ధుల జీవితం భరోసాగా గడవడం ఎలా?!



సీనియర్ సిటిజన్స్‌కు భరోసా ఏది?



పాశ్చాత్య దేశాల మాదిరి కాకుండా భారతదేశంలోని 40 శాతం మంది వృద్ధులు అత్యంత పేదరికంలో ఉన్నారు. 60 నుంచి 80 ఏళ్ల వయసులో ఉన్న మహిళలు ఆర్థిక, ఇతర అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడి ఉన్నారు. గ్రామీణ వృద్ధులు కుల, వర్గ ఆధారిత వివక్షకూ గురవుతున్నారు.

గ్రామాల్లో పెను సవాల్!

నగరాలలో ఉండే సీనియర్ సిటిజన్స్ జీవితాలతో పోల్చితే గ్రామాల్లో వారి పరిస్థితి దయనీయంగా ఉంది. వీరు కనీస సౌకర్యాలు కూడా లేకుండా జీవిస్తున్నారు. మన ఆరోగ్య విధానం సాధారణంగా మాతా, శిశు సంరక్షణపైనే ఉంటుంది. వృద్ధుల సంరక్షణకు అంతగా ప్రాధాన్యత ఇవ్వడం లేదు. గ్రామీణ వృద్ధులలో ప్రత్యేకించి మహిళలు ఆర్థిక, అవసరాల కోసం వారి కుటుంబాలపై పూర్తిగా ఆధారపడుతున్నారు. మన దేశంలో వృద్ధుల సంరక్షణ ఎక్కువ భాగం వారి పిల్లలు చూసుకోవడం ఆనవాయితీ. అయితే, కాలంతో పాటు ఈ విధానాలూ వేగంగా మారుతున్నాయి.

పిల్లల వలస..

పెరుగుతున్న ఒంటరితనం

విద్య, ఉద్యోగాల కోసం పిల్లలు వలసలు వెళ్లడం, ఉమ్మడి కుటుంబం వ్యవస్థ విచ్ఛిన్నం కావడం, వృద్ధుల సంరక్షణను ప్రశ్నార్థకంగా మార్చింది. నివేదికల ప్రకారం 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న వ్యక్తులలో 6 శాతం మంది ఒంటరిగా జీవిస్తున్నారు. 20 శాతం మంది పిల్లలు లేకుండా వారి జీవిత భాగస్వామితో మాత్రమే జీవిస్తున్నారు. ఈ సంఖ్య భవిష్యత్తులో గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. తక్కువ ఆదాయ కుటుంబాలలో వృద్ధుల ఆరోగ్య అవసరాలు ఆర్థికంగా భరించలేనంత భారంగా మారుతున్నాయి. భారతదేశంలో వృద్ధులపై వేధింపుల కేసులు కూడా క్రమంగా పెరుగుతున్నాయి. 'హెల్ప్ ఏజ్ ఇండియా' నివేదిక ప్రకారం 25 శాతం మంది పెద్దలు తమ సొంత కుటుంబాల ద్వారా వేధింపులకు గురవుతున్నారు.

సామాజిక భద్రత

హెల్ప్ ఏజ్ ఇండియా సూచనల మేరకు..

- దేశంలో వృద్ధుల కోసం అధికారిక సంస్థాగత సంరక్షణలో పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉంది. పటిష్టమైన పెన్షన్, సామాజిక భద్రతా వ్యవస్థ, మెరుగైన ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలను అందించడం ద్వారా వారి కుటుంబ సభ్యులపై వృద్ధులు ఆధారపడటం తగ్గించవచ్చు.
- దాదాపు 33 శాతం మంది వృద్ధ స్త్రీలకు ఎటువంటి ఆదాయం లేదు. 11 శాతం మందికి మాత్రమే పెన్షన్ ద్వారా ఆదాయం వస్తోంది. 16.3 శాతం మంది సామాజిక పెన్షన్ పొందుతున్నారు. సీనియర్ కేర్ సంస్కరణలపై ఇటీవల 'నీతి అయోగ్' సమర్పించిన ఓ నివేదిక ప్రకారం వృద్ధుల ఆర్థిక సాధికారతను నిర్ధారించడానికి ప్రభుత్వ నిధుల కవరేజీని పెంచడం, తిరిగి పని నైపుణ్యాలవైపు మళ్లించడం, తప్పనిసరి పొదుపు ప్రణాళికలు, రివర్స్ మార్టిగేజ్ మెకానిజమ్స్, పన్ను, జీఎస్టీ సంస్కరణల వంటి అనేక చర్యలు చేపట్టాలని పేర్కొంది.
- ఎటువంటి ఆస్తులు, ఆదాయం లేకుండా ఉన్నవారి అవసరాలకు అనుగుణంగా సంపూర్ణ వృద్ధాప్య సంరక్షణ నమూనాను అభివృద్ధి చేయాల్సి ఉంటుందనేది మరో సూచన.

నలుగురు కలిసి ఉంటే ఎంతో మేలు..

వృద్ధులైనా డబ్బున్నవారి పరిస్థితి బాగానే ఉంది. డబ్బులేని వారే జీవచ్ఛవాలుగా బతుకీడుస్తున్నారు.

- వృద్ధులకు ఓల్డేజ్ హోమ్స్ తప్ప మరో మార్గం లేదు. ఫుడ్ షెల్టర్ ఈ రెండే ఇస్తుంది. కానీ, ఎమోషనల్‌గా ఒంటరితనం ఫీలవుతుంటారు. అందుకే, రీ మ్యారేజ్ ద్వారా మేం ఒక సొల్యూషన్ చూపిస్తున్నాం. లేదంటే, ఒంటరిగా ఉన్న వృద్ధులు ప్రమాదాలకు, దోపిడీలకు గురవుతున్నారు. ఇలాంటప్పుడు నలుగురు వృద్ధులు కలిసి ఒక చోట ఉండవచ్చు. దీని వల్ల ఒంటరితనం పోగొట్టుకోగలుగుతారు.
- అప్పడాలు, వడియాలు వంటివి చేసి, వ్యాపారం చేసుకోవచ్చు. కానీ, 70 ఏళ్ల వయసులో ఏ పనీ చేయడానికి ఓపిక ఉండదు. పెట్టింది తినడం తప్ప ఏ రకమైన ఫిజికల్ స్ట్రెయిన్ పడలేరు. అందుకని, రూమ్మేట్స్ లాగా కలిసి ఉండాలి. అక్కడ చిన్న చిన్న కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవచ్చు, ఇండోర్‌గేమ్స్, స్థానిక పర్యాటక స్థలాలు చూసి రావచ్చు.
- యువత పట్టించుకోదు. మధ్య వయసువారికి కుటుంబ సమస్యలు. సీనియర్ సిటిజన్స్ పట్ల ఎవరికీ జాలి, దయ ఉండదు. వృద్ధులకు ఇచ్చే ఆత్మీయ స్పర్శను ఎంతో ఓదార్పుగా ఫీలవుతారు.
- రాజకీయ వర్గం తరచుగా యువ జనాభాను ఆర్థిక ఆస్తిగా పేర్కొంటుంది. పెరుగుతున్న వృద్ధ జనాభాకు నాణ్యమైన ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక, సామాజిక మద్దతును అందించడానికి అంతగా ఆసక్తి చూపదు. ఏ రకమైన ఆదాయం లేనివారికి ప్రభుత్వమే వారికో దారి చూపించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పెన్షన్ రూపేణ వచ్చే వనరుతోనూ నలుగురు కలిసి ఉండవచ్చు.



– ఎస్.ఎమ్.రాజేశ్వరి, తోడు నీడ స్వచ్ఛంధ సంస్థ, హైదరాబాద్

సేవాపథం

సెక్స్–ట్రాఫికింగ్ సర్వైవర్స్‌కు అండగా నిలబడి వారికి ఒక దారి చూపుతోంది రుచిర గుప్తా. యాంటీ–ట్రాఫికింగ్ యాక్టివిస్ట్, యూఎన్ అడ్వైజర్, విజిటింగ్ ప్రొఫెసర్, 'అప్నే ఆప్' కో–ఫౌండర్, రైటర్ రుచిర ఎందరో బాధితులకు అక్కగా, అండగా నిలబడింది.

చీకటి కూపం నుంచి వెన్నెల దారుల్లోకి



రుచిర

యువ జర్నలిస్ట్‌గా రుచిర గుప్తా నేపాల్‌కు వెళ్లింది. 'సహజ వనరులను గ్రామాలు ఏ రకంగా ఉపయోగించుకుంటున్నాయి' అనే అంశంపై కథనాలు రాయడానికి ఎన్నో గ్రామాలకు వెళ్లింది. సహజవనరులకు సంబంధించిన సమాచారం మాట ఎలా ఉన్నా చాలా గ్రామాల్లో వినిపించిన మాట....

'మా ఊళ్లో కొందరు అమ్మాయిలు కనిపించడంలేదు. వారి ఆచూకి తెలియడం లేదు' మారుమూల హిమాలయ కుగ్రామం అయిన సింధుపాల్‌చౌక్‌లో పేకాట ఆడుతున్న వారిని అమ్మాయిల అదృశ్యం గురించి అడిగింది రుచిర.

'వాళ్లు ముంబైలో ఉన్నారు' అని అసలు విషయం చెప్పారు వాళ్లు.

నేపాల్ నుంచి మన దేశానికి వచ్చిన తరువాత ముంబైలోని రెడ్‌లైట్ ఏరియా కామాటిపురాకు వెళ్లింది రుచిర. అక్కడ చిన్న చిన్న గదుల్లో అమ్మాయిలు బంధించి ఉండటాన్ని గమనించింది. బాధగా అనిపించింది. అయితే ఆమె బాధ దగ్గరే ఆగిపోలేదు. ' వారికోసం ఏదైనా చేయాలి' అని మనసులో గట్టిగా అనుకుంది.

నేపాల్ గ్రామాల నుండి ముంబైలోని వ్యభిచార గృహాలకు యువతులు, బాలికల అక్రమ రవాణాను బహిర్గతం చేయడానికి కెనడియన్ బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ కోసం 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' అనే డాక్యుమెంటరీ తీసింది.

ఈ డాక్యుమెంటరీ కోసం ఎంతోమంది అమ్మాయిలతో మాట్లాడింది. వారు చీకటికూపాల్లో చిక్కుకుపోవడానికి ప్రధాన కారణం...కటిక పేదరికం. ఈ డాక్యుమెంటరీ చేస్తున్నప్పుడు ఆమెపై హత్యా ప్రయత్నాలు కూడా జరిగాయి. ఒకడు కత్తితో పొడవడానికి వచ్చినప్పుడు అక్కడ ఉన్న మహిళలు తమ ప్రాణాలను పణంగా పెట్టి మరీ ఆమెను రక్షించారు.

అవుట్ స్టాండింగ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం కోసం ఇచ్చే ఎమ్మీ అవార్డ్‌ను 'ది సెల్లింగ్ ఆఫ్ ఇన్నోసెంట్స్' గెలుచుకుంది.

అవార్డ్ అందుకుంటున్నప్పుడు చప్పట్ల మధ్య, ప్రకాశవంతమైన దీపాల మధ్య ఆమెకు కనిపించిందల్లా చీకటి కొట్టాలలోని బాధితుల కళ్లు మాత్రమే. 'జర్నలిజంలో నేను మరో మెట్టు పైకి చేరడానికి కాకుండా మార్పుకోసం ఈ డాక్యుమెంటరీ ఉపయోగపడాలని కోరుకున్నాను' అంటుంది రుచిర.

అక్రమ రవాణాపై కఠిన చట్టాలు తీసుకురావడానికి సహాయపడాల్సిందిగా అప్పటి యూఎస్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ సెక్రటరీ డోనా షలాలాతో మాట్లాడింది రుచిర. డోనా ద్వారా ఐక్యరాజ్య సమితి సమావేశంలో తన డాక్యుమెంటరీని ప్రదర్శించడమే కాదు వివిధ దేశాలకు చెందిన 180 మంది ప్రతినిధులతో మాట్లాడింది.

ఇరవై రెండు మంది మహిళలతో కలిసి 'అప్నే ఆప్–ఉమెన్ వరల్డ్ వైడ్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించింది రుచిర గుప్తా. అక్రమ రవాణ నిరోధించడానికి, బాధితులకు అన్ని రకాలుగా సహాయం అందించడానికి ఈ సంస్థ అలుపెరుగని కృషి చేస్తోంది. వ్యభిచారాన్ని 'కమర్షియల్ రేప్'గా పిలుస్తున్న 'అప్నే ఆప్' బాధితులకు సంబంధించి విద్య, ఆరోగ్య సంరక్షణ, లైఫ్ స్కిల్స్, చట్టపరమైన రక్షణ, ప్రభుత్వ పథకాలు... మొదలైన వాటిపై దృష్టి పెట్టింది.

ఇప్పటివరకు ఇరవై రెండు వేలమందికి పైగా మహిళలు, బాలికలను వ్యభిచార కూపాల నుంచి బయటికి తీసుకురావడంలో సహాయపడిన రుచిర ఎంతోమంది అమ్మాయిలు చదువుకునేలా చూసింది. సొంత కాళ్ల మీద నిలబడేలా చేసింది.

దేశ, విదేశాలకు చెందిన ఎన్నో ప్రతిష్ఠాత్మక అవార్డ్‌లు అందుకుంది రుచిరా గుప్తా. అయితే వాటి కంటే కూడా చీకటి కూపం నుంచి బయటికి వచ్చిన బాధితుల కంట్లో కనిపించే వెలుగే తనకు అతి పెద్ద అవార్డ్‌గా భావిస్తానంటుంది రుచిర.

ఇంటిప్స్

బూట్ల

నుంచి దుర్వాసన రావడానికి ప్రధాన కారణం చెమటతో తడిసిన సాక్స్‌ను అలాగే ఉంచడం, తడీపొడిగా ఉన్న సాక్స్‌ను అలాగే ధరించడం. అందువల్ల సాక్స్ తడిగా కాకుండా చూసుకోవాలి. ● బూట్లను ఉపయోగించిన తర్వాత గాలి ఆడేటట్లు బైట పెట్టాలి. సాక్స్‌ను ఎప్పటికప్పుడు ఉతికేసి ఆరేయాలి. కానీ కొందరు వారం రోజుల పాటు ఒకేజత సాక్స్ లను ధరిస్తారు. దీంతో బూట్లనుంచి భరించలేని దుర్వాసన వస్తుంది. ● ముఖ్యంగా బైటకు రాగానే సాక్స్ తీసి పక్కన పెట్టాలి. షూ లేస్‌ను కూడా ఉతికి ఎప్పటికప్పుడు క్లీన్‌గా ఉంచుకోవాలి. వారానికి ఒకసారి షూస్‌ను కూడా శుభ్రంగా కడిగేసుకోవాలి. ఇలా చేస్తే బ్యాక్టీరియా, వైరస్ ఉండవు. ● నిమ్మకాయ తొక్క లేదా కమలా, నారింజ తొక్కల వంటివి బూట్లలో వేస్తే వాటినుంచి చెడువాసన రాదు. అందుకే రాత్రిపూట కొన్ని నిమ్మ/ నారింజ/ కమలా తొక్కలను బూట్లలో వేసి పొద్దున్నే తీసేయాలి. ఇలా చేస్తుంటే బూట్ల నుంచి దుర్వాసన అనేది ఉండదు. ● తడిగా ఉన్న బూట్లలో బేకింగ్ సోడా వేస్తే మంచి ఫలితం ఉంటుంది. ఇది బూట్లలోని తేమను గ్రహించుకుంటుంది. అందుకే షూస్ వాసన వచ్చినప్పుడు బేకింగ్ సోడా వేస్తుండాలి. కొన్నిరకాల డస్టింగ్ పౌడర్‌లు వేసినా దుర్వాసన రాకుండా ఉంటుంది.



టిప్



బఠాణీతొక్క కూడానూ..

పచ్చిబఠాణీ మనకు ఎంతమేలు చేస్తుందో తెలిసిందే. అయితే బఠాణీ పిక్కలు తీసి తొక్కలను పారేస్తుంటాము. కానీ ఈ తొక్కలు మొక్కలు చక్కని పోషకాలు అందిస్తాయి. అందుకే తొక్కలను మిక్సీజార్‌లో వేసి పేస్టు చేయాలి. ఈ పేస్టులో కాసిన్ని నీళ్లు పోసి వడగట్టాలి. ఈ నీటిని గార్డెన్‌లోని మొక్కలకు పోయాలి. ఈ నీరు మొక్కలు మంచి బలవర్ధకమైన టానిక్‌లా పనిచేసి చక్కగా పెరిగేందుకు దోహదపడతాయి.

స్ఫూర్తి

సైన్స్‌ను సామాన్యుల దగ్గరికి తీసుకుపోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి ఫాల్కి.
'సైంటిఫిక్ స్టోరీ టెల్లర్'గా దేశవిదేశాల్లో పేరు తెచ్చుకున్న జాహ్నవి సైన్స్‌కు సంబంధించిన డాక్యుమెంటరీలు తీసింది. పుస్తకాలు రాసింది.

జాహ్నవి సామాన్య శాస్త్రం



జాహ్నవి ఫాల్కి

తెలుసుకోవాలంటే మనం మొదట ఉండాల్సింది టేబుల్ దగ్గర' అంటున్న జాహ్నవి 'సైన్స్' అనే మెనూ గురించి తెలుసుకోవడానికి 'సైన్స్ గ్యాలరీ' అనే టేబుల్ దగ్గరికి ప్రజలను తీసుకువస్తుంది.

లండన్‌లోని కింగ్స్ కాలేజీ ఫ్యాకల్టీగా పనిచేసిన జాహ్నవి 2018లో 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ఫౌండింగ్ మెంబర్‌గా నియమితురాలైంది.

ఉరుకుల పరుగుల పోటీ ప్రపంచానికి కాస్త దూరంగా... సృజనాత్మకంగా ఆలోచించేలా, సైన్స్‌కు దగ్గరయ్యేలా యువతను ఆకట్టుకోవడానికి 'బెంగళూరు సైన్స్ గ్యాలరీ' ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి.

'మ్యూజియం' వాతావరణం ఆమెకు కొత్త కాదు. 'సైన్స్ మ్యూజియం లండన్' ఎక్స్‌టర్నల్ క్యూరేటర్‌గా పనిచేసి ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది.

'అడగడం' 'తెలుసుకోవడం' అనే ప్రక్రియ జాహ్నవికి ఎంతో ఇష్టమైనది. ఆమెకు బాగా నచ్చే మాట... రైట్ క్వశ్చన్. రిసెర్చ్ వర్క్ నుంచి కెరీర్‌కు సంబంధించి డైరెక్షన్‌ను మార్చుకోవడం వరకు 'రైట్ క్వశ్చన్' అనేది ఆమెకు ఎంతో ఉపయోగపడింది. అమెరికాలోని జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరకు తీసుకెళ్లింది. అక్కడ భారతదేశ శాస్త్ర సాంకేతిక చరిత్రను అధ్యయనం చేసింది.

ఆ చరిత్రపై బాగా ఇష్టాన్ని పెంచుకుంది.

తాను తెలుసుకున్న విషయాలను, తన అభిప్రాయాలను నలుగురితో పంచుకోవడానికి వివిధ మాధ్యమాలను ఎంచుకుంది.

'బాంబే యూనివర్శిటీ'లో సివిక్స్ అండ్ పాలిటిక్స్ చదువుకున్న జాహ్నవి 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లో సైన్స్ అండ్ టెక్నాలజీ హిస్టరీలో డాక్టరేట్ చేసింది. సామాజిక శాస్త్రాల అధ్యయనం ద్వారా సామాజిక కోణంలో సైన్స్‌ను అర్థం చేసుకుంది.

ఆమె మాటల్లోనే చెప్పాలంటే 'సైన్స్ అనేది ఒంటరి కాదు'

సైన్స్‌ను ప్రభావితం చేసే అంశాలు సమాజంలో ఎన్నో ఉంటాయి. ఆ అంశాలకు సైన్స్‌కు మధ్య ఉండే అంతః సంబంధాన్ని లోతుగా అధ్యయనం చేసింది.

'ఆటోమిక్ స్టేట్: బిగ్ సైన్స్ ఇన్ ట్వంటీయత్ సెంచరీ ఇండియా సైన్స్' పుస్తకం జాహ్నవికి ఎంతో పేరు తెచ్చింది. 'కీ కాన్సెప్ట్స్ ఇన్ మోడ్రన్ ఇండియన్ స్టడీస్'కు కో–ఎడిటర్‌గా వ్యవహరించింది. 'సైక్లోట్రాన్' పేరుతో సైన్స్ డాక్యుమెంటరీ తీసింది. సైంటిఫిక్ ఇన్‌స్ట్రుమెంట్స్ ద్వారా కథలు చెప్పడం తనకు ఇష్టమైన పని.

'మెనూ గురించి

'మా టార్గెట్ ఆడియెన్స్ పదిహేనేళ్ల పైబడిన వారు అయినప్పటికీ అండర్ గ్రాడ్యుయేట్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్‌లపై కూడా దృష్టి సారిస్తాం. అంతరిక్షానికి సంబంధించి సమకాలీన, భవిష్యత్ విషయాలపై దృష్టి పెట్టేలా గ్యాలరీ తోడ్పడుతుంది' అంటుంది జాహ్నవి.

శాస్త్రీయ విషయాలతో యువత మమేకం కావడానికి డిజిటల్ ఎగ్జిబిషన్ ద్వారా ప్రయత్నిస్తోంది జాహ్నవి. 'బ్రేకింగ్ ది వాల్స్ బిట్వీన్ సైన్స్ అండ్ కల్చర్' శీర్షికతో నిర్వహించిన ఆన్‌లైన్ సైన్స్ గ్యాలరీకి కూడా మంచి స్పందన వచ్చింది.

ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ జాహ్నవిని హ్యుమానిటీస్ విభాగంలో 'ఇన్ఫోసిస్ ప్రైజ్'తో సత్కరించింది.

సైన్స్‌ను జాహ్నవి అర్థం చేసుకున్న కోణాన్ని, చేపడుతున్న కార్యక్రమాలను ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ ప్రశంసించింది.

● నీటి పంట

షెల్ఫ్‌లో పండిద్దాం



శరవణన్



శరవణన్ తాత సేంద్రియ సేద్యం చేశాడు, తండ్రి కెమికల్ ఫార్మింగ్ వెంట పరుగెత్తి దిగుబడి పెంచాడు. ఆ పరుగునే వారసత్వంగా అందుకున్న శరవణన్ కూడా 2006 వరకు కొనసాగించాడు. ఆ తర్వాత అతడు తన జీవితానికి తానే పరిశోధకుడయ్యాడు. పంట పొలం నుంచి ఇంటి అల్మరాల వరకు సాగిన ప్రయోగాల్లో మొక్కజొన్నను ఇంటిలోపల అరల్లో నీటితో పండిస్తున్నాడు. శరవణన్ ప్రయోగాలకు మెచ్చిన శాస్త్రీయమైన శాస్త్రవేత్తల సమాఖ్య ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అతడిని 'ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డ్'తో సత్కరించింది. శరవణన్ గురించి ఇంకా తెలుసుకోవాలంటే తమిళనాడు, నమక్కల్ జిల్లాలోని 'అరియగౌండమ్ పట్టి' బాట పట్టాల్సిందే.

మట్టిలేని పంట

అది 2005, ప్రభుత్వం వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు చేపడుతూ మైక్రో ఇరిగేషన్ విధానాన్ని తెచ్చింది. డ్రిప్, స్ప్రింక్లర్ సాగును పరిచయం చేసింది. అందుకు అవసరమైన పరికరాలను రాయితీతో ఇచ్చింది. అప్పుడు ఓ తొలి అడుగు వేశాడు శరవణన్. అది తనను గేమ్ చేంజర్‌గా మారుస్తుందని ఊహించలేదతడు. ప్రయోగాత్మకంగా ఆచరణలో పెట్టాలనే ఆలోచన అలా ఉండగానే అతడు అప్పటి వరకు సాగు చేస్తున్న రసాయన ఎరువుల పంటను అంతు చిక్కని తెగులు తినేసింది. కృషి విజ్ఞానకేంద్రాల శిక్షణతో కొత్తపంథాలో నడిచాడతడు. వర్మీ కంపోస్ట్, పంచగవ్య, వేపచెక్క వంటి ప్రయోగాలన్నీ చేశాడు. ఆరు ఎకరాల పొలంలో పసుపు, వేరు శనగ, కూరగాయలు పండించాడు. వీటితో పాటు అక్వాకల్చర్, పాడి, కోళ్ల పరిశ్రమ, బయోగ్యాస్ ప్లాంట్‌లను కూడా నిర్వహించాడు. ఒక వ్యర్థాలు మరొక పంటకు ఎరువుగా మారే విధానాలన్నింటినీ ఏర్పాటు చేశాడు. తనకైతే వ్యవసాయ భూమి ఉంది కాబట్టి పాడి పశువులకు కావలసిన గడ్డికి సమస్య లేదు. పొలం లేని వాళ్లు పాడిపరిశ్రమ మీద ఉపాధి పొందేవారి కోసం ఓ ప్రత్యామ్నాయం ఉండాలనుకున్నాడు. ఆ ప్రయోగంలో భాగంగా హైడ్రోఫోనిక్ కల్చర్ మొదలు పెట్టారు. అంటే నీటితో పంటలు పండించే విధానం అన్నమాట. హైడ్రోఫోనిక్ కల్చర్‌లో కూరగాయలు పండించుకునే వాళ్లు సంబంధిత సామగ్రిని ఇంటి పైకప్పు మీద ఏర్పాటు చేసుకుంటూ ఉంటారు. శరవణన్ అదే ప్రయత్నాన్ని మొక్కజొన్న పంటను ఒక అల్మైరాలో చేసి చూపించాడు. శరవణన్ ప్రయోగాన్ని రైతులకు మోడల్‌గా చూపించింది కృషి విజ్ఞాన్ కేంద్రం. షెల్ఫ్ అరల్లో దశలవారీగా మొక్కజొన్న గింజలను వేస్తూ ఏడాదంతా పాడి పశువులకు పచ్చిగడ్డి అందేలా రూపొందించాడు. రైతులకు సౌకర్యంగా ఉండేటట్లు ఒక కిట్‌ను రూపొందించాడు. అర కేజీ మొక్కజొన్న గింజలతో ఐదుకేజీల గడ్డిని వారం రోజుల్లో సాధించవచ్చు. ఎనిమిదవ రోజు ఆ అరను ఖాళీ చేసి మళ్లీ కొత్తగింజలను వేసుకోవచ్చన్న మాట. ఇంట్లో నాలుగు షెల్ఫ్‌లుంటే చాలు రెండు పాడిగేదెల కడుపు నింపే మేత చేతికొస్తుంది.

విజయవంతమైన ప్రయోగాలు చేయాలంటే పెద్ద పెద్ద చదువులు చదివి ఉండాల్సిన అవసరం లేదు, ఆసక్తి, నిరంతర శ్రమ ఉంటే సాధించవచ్చని నిరూపించాడు శరవణన్. అతడు రైతులకు మార్గదర్శనం చేయడంతోపాటు వ్యవసాయ విద్యార్థులకు పాఠ్యాంశం అవుతున్నాడు.



